క్లుప్తంగా

ముషీరాబాద్ డీఎంసీగా తిప్పర్తి యాదయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ డీఎంసీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ తిప్పర్తి యాదయ్యకు సీపీఐ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటస్వామిగౌడ్ తన కార్యాలయంలో శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీనివాసరావుకు నివాళి

నల్లకుంట: శ్రీనివాసరావు మరణం తెలంగాణ బ్రాహ్మణ సమాజానికి తీరనిలోటని టీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. ఆయన ప్రథమ వర్ధంతిని శుక్రవారం నల్లకుంటలోని టీబీఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు చిత్రపటానికి టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావుతో కలిసి నివాళులర్పించారు. ఆయన తన ఆస్తిని జీయర్ ట్రస్టుకు విరాళంగా అందజేసి ఉదారతను చాటుకున్నారని పోచంపల్లి రమణారావు అన్నారు. అవసాన దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కున్నప్పటికీ ఎవరి వద్ద చేయిచాచని ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. టీబీఎస్ఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంత్రి సునిల్, ఉపాధ్యక్షుడు రామారావు, సహాయ కార్యదర్శులు దేవులపల్లి అశోక్‌కుమార్, బాలచందర్, ప్రచార కార్యదర్శి పురుషోత్తమరావు, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ టీర్టీ క్వార్టర్స్‌లోని పోచమ్మ దేవాలయం నుంచి జవహర్‌నగర్ స్కూల్ మెయిన్‌రోడ్డు వరకు నూతన వీడీసీసీ రోడ్డు నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటామని డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్ కుమార్ అన్నారు. స్థానికులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని శుక్రవారం ఆమెకు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ యువనాయకులు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయిచంద్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, బీజేవైఎం అధ్యక్షుడు అరుణ్‌కుమార్, స్థానిక బస్తీవాసులు దశరథ్, రవి, శివకుమార్, కుసుమ, పాపమ్మ, తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ



చిక్కడపల్లి: ప్రముఖ రచయిత్రి ఇందిరాదేవి రచించిన మంచు గులాబి పుస్తకావిష్కరణ సభ సాయంత్రం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎ.శ్రీధర్ శుక్రవారం మాట్లాడుతూ.. మంచు గులాబి రచన గులాబి రచన ఎంతో చదివించేలా ఉందని సమాజంలోని పలు అంశాలను తన కథల్లో మలిచి చెప్పిన తీరు బాగుందన్నారు. రచయిత్రి ఇందిరదేవి మాట్లాడుతూ.. సమాజానికి ఒక సందేశాన్ని ఇచ్చే రచనలు కూడా పాఠకులు చదవకపోవడం బాధ కలిగిస్తుందన్నారు. ఎన్నో విషయాలు తెలియజేసే రచనలను చదవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, గాయని, గాయకులు కమలాశాస్త్రి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కాచిగూడ: రెండు వేర్వేరు ఘటనల్లో మృతదేహాలను కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వృద్ధుడి(51) మృతదేహం ఉంది. కాగా నింబోలిఅడ్డాలోని ఫుట్‌పాత్‌పై మరో గుర్తుతెలియని వృద్ధుడి (55) మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు రెండు మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి అదృశ్యం..

చిక్కడపల్లి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భూక్యాభద్రు (74) ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సందీప్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

• దోమలగూడ బాదం గల్లీకి చెందిన కమ్మరి సిద్దన్న(60) శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆయన కుమారుడు కమ్మరి ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని గాంధీనగర్ డివిజన్-89 కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తెలిపారు. తాను విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో ఏటా అడుగుపెడుతున్న సందర్భంగా తాము చేపట్టిన అభివృద్ధి పనులు సేవా కార్యక్రమాలను సాక్షితో శుక్రవారం పంచుకున్నారు.

- గాంధీనగర్, కవాడిగూడ రిటర్నింగ్‌వాల్ అభివృద్ధిపనులకు రూ.30కోట్లు గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ నుంచి అరుంధతినగర్, బాపూనగర్ వరకు రిటర్నింగ్‌కు రూ.15 కోట్లు జీహెచ్‌ఎంసీ జనరల్‌నిధులు డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.6 కోట్లు మొత్తంగా రూ. 21 కోట్లతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.
- పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, కమ్యూనిటీహాల్, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, పరిశుభ్రత తదితర అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేందుకు నిత్యం ప్రజల్లో మమేకమై ఉంటామన్నారు.

ఇచ్చిన హామీలు...

- గాంధీనగర్ డివిజన్‌లో ఉద్యోగ ఉపాధి, కల్పనకు కృషి చేస్తున్నాం. ప్రధానంగా చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా లోన్‌లు మంజూరు చేయించి ఇచ్చాం.
- ముద్ర లోన్‌లు, వాల్మీకి ఆవాస్‌యోజన ప్రధాన మంత్రి రోజ్‌ఘర్ యోజన కింద నిరుద్యోగులకు ఆర్‌ఆర్‌బీ ఉద్యోగాలు వచ్చాయని కార్పొరేటర్ వివరించారు.
- అసంఘటిత కార్మికులకు ఈ- శ్రమ్ కార్డు నమోదు, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను అందించామన్నారు. కాలనీలు, బస్తీల్లో తాగునీటి సమస్యలను తీర్చామన్నారు.
- ఉల్లిగడ్డబావి, జవహర్‌నగర్, వివేక్‌నగర్ బస్తీ, బాపూనగర్, స్వామి వివేకానందనగర్, నేతాజీనగర్, సంజీవయ్యనగర్, టీఆర్టీ, ఎస్సార్టీలలో తాగునీటి, లోప్రెషర్ సమస్యను అధిగమించామన్నారు.
- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సహకారంతో డివిజన్ అంతా విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు, కొత్త స్తంభాలు తదితర పనులను చేపట్టాం.
- గత కొన్నేళ్లుగా సీవరేజ్ పైపులైన్ సమస్యను ఏడాది పాటు శ్రమించి జలమండలి ఎండీ దానకిషోర్‌తో చర్చించి రూ.58 లక్షలతో నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు.



కలెక్టర్‌శర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కార్పొరేటర్

- రూ.15కోట్లతో అరుంధతినగర్ నుంచి బాపూనగర్ రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రమాదాలు జరగకుండా స్థానికుల ఫిర్యాదుతో ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు వేయించాం.
- చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, వివేక్‌నగర్, హనుమాన్‌దేవాలయం, గాంధీనగర్ వై జంక్షన్, ఆంధ్రవిద్యాలయం తదితర ప్రాంతాల్లో వేయించారు. లక్ష్మీగణపతి దేవాలయం డ్రైనేజీ సమస్య పరిష్కరించాం.
- వి.వి.గిరి నగర్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తయ్యింది. త్వరలోనే మహిళాభవన్‌ను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి శిక్షణ కోసం ఉపయోగిస్తాం.
- రూ.60 లక్షలతో హెబ్రోన్‌చర్చి, ఆంధ్రాకేఫ్, ఎంపీఎం హోటల్, హనుమాన్‌టెంపుల్, రత్నదీప్ సూపర్‌మార్కెట్ వరకు రోడ్డు వేశాం. కెనరా బ్యాంక్ రోడ్డు, మైత్రి హాస్టల్స్ గజేంద్రప్యాలెస్ కచ్చామోరి నాలా రూ.45లక్షలతో నిర్మాణ పనులను పూర్తి చేశాం.
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇచ్చాం. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని అవగాహన కల్పించాం.
- అశోక్‌నగర్ వేల్ఫేర్ సెంటర్‌కు కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తుకు రూ.10 లక్షలు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నిధులతో అభివృద్ధిచేశాం.

ఇంకా నెరవేరని హామీలు..

- బోర్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఆధునాతన లైబ్రరీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. చిక్కడపల్లిలో మోడల్ సూపర్ మార్కెట్ నిర్మించాల్సి ఉంది. స్వామి వివేకానందనగర్‌లో ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా విన్నవించామన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం..

గాంధీనగర్ డివిజన్‌లో ఎలాంటి సమస్య వచ్చిన 24 గంటలు తమకు ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తాం. కోట్ల రూపాయలతో చేపట్టిన స్టీల్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాం. – ఎ.పావనివినయ్‌కుమార్, కార్పొరేటర్ గాంధీనగర్



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ తదితరులు

కార్పొరేటర్ల హౌస్ అరెస్ట్

అంబర్‌పేట: బీజేపీ కార్పొరేటర్లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని బీజేపీ కార్పొరేటర్లు చేపట్టారు. దీంతో బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డిని పోలీసులు ఆమె నివాసంలో శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టే జీహెచ్‌ఎంసీకి బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆమె మండిపడ్డారు.

కాచిగూడ: జీహెచ్‌ఎంసీకి రావాల్సిన మొండి బకాయిలు,నిధుల విడుదలపై బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు పోలీస్ సిబ్బందితో కార్పొరేటర్ ఇంటి నుంచి బయటికి వెళ్లొద్దని సూచించారు. దీంతో కార్పొరేటర్ గురువారం రాత్రి వరకు గృహ నిర్బంధంలోనే ఉన్నారు.



కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్



బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



సత్యనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

అభివృద్ధి పనుల పరిశీలన

నల్లకుంట: డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. సంబంధిత శాఖ అధికారులు అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. ఉండాలన్నారు. డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో ఇటీవల చేపట్టిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను కార్పొరేటర్ హెచ్చరించారు.

‘వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర’

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఆచరణలో వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కోతలు విధించడం సరికాదన్నారు. వ్యవసాయానికి రూ. 71,378 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. మొత్తం కేంద్ర బడ్జెట్‌లో 3.2 శాతం మాత్రమే కేటాయించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్, రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఆంజనేయులు, చెన్నయ్య తదితరులున్నారు.



కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

జ్ఞాపకాలకు నిలయంగా రైల్వే మ్యూజియం



కాచిగూడ రైల్వే స్టేషన్ మ్యూజియాన్ని తిలకిస్తున్న రైల్వే ఏజీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి

కాచిగూడ: ఆనాటి జ్ఞాపకాలకు కాచిగూడ రైల్వే మ్యూజియం నిలువుటద్దంగా నిలుస్తుందని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాటి స్టీమ్ ఇంజిన్ నుంచి నేటి విద్యుత్ ఇంజిన్ వరకు రైల్వేలో వచ్చిన మార్పులను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారన్నారు. శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని రైల్వేశాఖ అధికారులతో కలిసి ఆయన తిలకించారు.

- 2016లో కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు.
- స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పురాతనమైన రైల్వే వస్తువులు, సాధించిన అవార్డులు, నిజాం హయాంలో రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ ఫోటోలను ఏజీఎం తిలకించారు.
- ఈ మ్యూజియం నేటి తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని రైల్వే పట్ల పూర్తి అవగాహన పెంపొందుతుందని ఏజీఎం పేర్కొన్నారు. ఏడీఆర్‌ఎం కోటేశ్వర్‌రావు, ఏడీఈ ఎన్. ప్రతాప్, ఏడీఎస్ భాస్కర్, కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ ప్రభుచరణ్ పాల్గొన్నారు.

తవ్వి పోసిన రోడ్డుకు మోక్షం

నల్లకుంట: పాత నల్లకుంట డాక్టర్ ఛారీలేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం మూడు వారాల క్రితం రోడ్డు తవ్విపోశారు. దీంతో స్థానికులు సమస్యను సాక్షి దృష్టికి తీసుకెళ్లగా.. ఈనెల 9 న ‘తవ్వి పోశారు, నిర్మాణం మరిచారు’ పేరిట సాక్షి కథనాన్ని ప్రచురించింది. కథనానికి స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి గురువారం రాత్రి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు నిర్మాణం పూర్తి చేయించిన దృశ్యం

ఐకేపీ, వీఓఏ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



బహిరంగ సభలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఎస్‌ఈఆర్‌పీ)లో గ్రామస్థాయిలో పని చేస్తున్న ఐకేపీ, వీఓఏలకు ఉద్యోగులకు భద్రత కల్పిస్తూ.. సెర్ప్ ఉద్యోగులుగా వారిని గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య పార్కు వద్ద తెలంగాణ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 18 ఏళ్ల నుంచి గ్రామాల్లో మహిళల అభివృద్ధి, స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తూ.. వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న ఐకేపీ, వీఓఏ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

- రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం, అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు.
- గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు చెల్లించాలని, సెర్ప్ నుంచి వీఓఏలకు ఐడీ కార్డు మంజూరు చేయించి మహిళా వీఓఏలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు.
- ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్.వీ.రమా, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేష్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల హాస్టల్ ప్రారంభం



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి

కాచిగూడ: ప్రభుత్వ బాలికల హాస్టళ్లలో బాలికలకు మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తున్నామని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి అన్నారు. శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికల హాస్టల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సన్న బియ్యంతో భోజనం, పూర్తి వసతులు కల్పిస్తున్నామన్నారు. బాలికల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు. కరోనాతో మూతపడిన అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ హాస్టల్‌లో 100 మంది బాలికలకు వసతి కల్పిస్తున్నామని పూర్తి భద్రతా చర్యలు చేపట్టామన్నారు. హిమాయత్‌నగర్ మండల ఉప విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, సెక్టార్ ఆఫీసర్ లక్ష్మణసింగ్, ఫాతిమా, ప్రియదర్శిని సంస్థ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ‘నాన్ క్రిమిలేయర్’ ఆదాయ పరిమితిని పెంచాలి

ప్రధానికి బహిరంగ లేఖ

కాచిగూడ: ఓబీసీ ‘నాన్ క్రిమిలేయర్’ ఆదాయ పరిమితిని పెంచకపోవడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలులో ఉన్న రూ.8లక్షలు ఉన్న సీలింగ్ ‘సంతృప్త స్థాయి’లో ఉందనడం బీసీలపై కేంద్రం నైజానికి నిదర్శనమని ఆరోపించారు.

- మెజారిటీ ప్రజలను వారి ఆకాంక్షలను నెరవేర్చకుండా పాలన సాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి ఇది విఘాతమని ప్రధానమంత్రి నరేంద్రమోదీని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బహిరంగ లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు.
- డీఓపీటీ నిబంధనలు, జాతీయ బీసీ కమీషన్, ఓబీసీ పార్లమెంటరీ స్థాయి సంఘం సిఫార్సులను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.
- ఎన్‌సీబీసీ సిఫార్సులే చేయలేదని చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమే అవుతుందని బీసీలకు తీరని నష్టం కలిగే అవకాశం ఉందన్నారు.
- ఓబీసీలకు గత ఏడేళ్లుగా అమలులో ఉన్న ‘నాన్ క్రిమిలేయర్’ రూ.8 లక్షల ఆదాయ పరిమితి ‘సంతృప్త స్థాయి’లో ఉందని, ఈ పరిమితిని పెంచాల్సిన అవసరం లేదని కేంద్రం ప్రకటించడం సరికాదన్నారు.
- లోక్‌సభలో కేంద్ర, సామాజిక న్యాయసాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ చేసిన ప్రకటనతోనే నిరసన చేపడుతున్నామన్నారు.
- దేశంలో 56 శాతం జనాభా కలిగిన ఓబీసీ సమస్యలను వారి కనీస అవసరాలను నెరవేర్చకుండా గాలికి వదిలేయడం సబబు కాదన్నారు.
- ఓబీసీ వర్గాల నుంచి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన నరేంద్రమోదీ ఈ వర్గాలకు ఎంతో మేలు చేస్తారని ఎన్నో ఆశలు ఆకాంక్షలు పెట్టుకున్నామన్నారు.
- కేంద్రం తన వైఖరిని మార్చుకుని వెంటనే నాన్ క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని రూ.15 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ధర్నాలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

ముషీరాబాద్: బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారి అభ్యున్నతికి పాటుపడి న్యాయం చేయాలని రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షులు నీలా వెంకటేష్, రాష్ట్ర బీసీ యువజన సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో 70 కోట్లకు పైగా జనాభా 65 శాతం గల బీసీలు ఇప్పటికి ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ లేకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.42 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బీసీలకు బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.
- స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బీసీ కులాల్లో అత్యంత వెనుకబడిన కులాలు ఉన్నాయన్నారు. హక్కుల కోసం వాటాల కోసం పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భూపేష్‌సాగర్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ ఉమ్మడిజిల్లా మల్లేశం పటేల్, బీసీ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూపా శ్యామ్, సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, బీసీ యువజన సంఘం నగర అధ్యక్షులు నితిన్, హైదరాబాద్ గ్రేటర్ ప్రెసిడెంట్ భూపేష్‌సాగర్, మండల అధ్యక్షుడు దిలీప్, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.